తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
...క్షాన అక్షర యజ్ఞం
23-06-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 300 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



# సీబీఎన్ తో పోటీ పడే అవకాశం



- 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలు
- వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్
- సీఎం రేవంత్ రెడ్డి

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబులను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ ఈ ఆసుపత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు.

**జయభేరి, హైదరాబాద్:**

ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా చేశారన్నారు. పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన మనల్ని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారని చెప్పారు.ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం తనకు గతంలో వచ్చిందని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలన్నారు. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని ఈ సందర్భంగా వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుందని చెప్పారు. ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుందని భరోసా కల్పించారు.వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతామన్నారు. రాజకీయం, సంక్షేమం ఈ రెండింటిని ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారని కీర్తించారు.ఎన్టీఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నందమూరి బాలకృష్ణ తనను 25వ వార్షికోత్సవంకు రావాలని కోరుతున్నారు..

...మిగతాది 2 లో

# అభివృద్ధి భాగస్వామి బంగ్లాదేశ్

- సంబంధాలు బలపడాలి: మోదీ
- బంగ్లా ప్రధాని హసీనాతో భేటీ
- సమగ్ర ఆర్థిక ఒప్పందంపై మళ్లీ చర్చలకు నిర్ణయం



**జయభేరి, న్యూఢిల్లీ:**

సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) పై చర్చలు ప్రారంభించాలని, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనే దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం

...మిగతాది 2 లో

# బోనాలకు భారీ బందోబస్తు

**- జయభేరి, సికింద్రాబాద్:**

సికింద్రాబాద్ లోని ప్రతిష్టాత్మక ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరను పురస్కరించుకొని దేవాలయ ఆవరణలో నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జాతర విజయవంతం కోసం, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లపై నిమగ్నమై ఉన్నారని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇంకా ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే చెప్పాలని కోరినట్లు పేర్కొన్నారు. జూలై 21న జాతర, 22న రంగం భవిష్యవాణి, అంబారీ ఊరేగింపు ఉంటుందని దానికి తగ్గట్టుగా సీసీ కెమెరాలను, భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు..



# 14 రోజులు దర్శనం ఇవ్వని జగన్నాథుడు

**జయభేరి, భువనేశ్వర్, జూన్ 22:**

పూరీలోని జగన్నాథ ఆలయంలో ప్రతి సంవత్సరం జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తారు. జగన్నాథుని ఈ రథయాత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాది కూడా జగన్నాథ రథయాత్రకు ఉత్సాహంగా సన్నాహాలు చేస్తున్నారు. జగన్నాథ రథయాత్రకు ముందు.. సహస్త్రధార స్నాన ఆచారం నిర్వహించబడుతుంది. ఆ తర్వాత హిందూ విశ్వాసం ప్రకారం 14 రోజుల పాటు స్వామిని

...మిగతాది 2 లో

# కదులుతున్న నీట్ డొంక




**జయభేరి, పాట్నా, జూన్ 22:**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీకమ్ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ 2024 పరీక్షలో అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలను గతవారం కేంద్ర విద్యాశాక, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తోసిపుచ్చింది. లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని ఆరోపణలు కొట్టిపారేసింది. ప్రతి పక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించాయి. అయితే, పేపర్ లీక్ నిజమేనని ఆధారాలతో సహా బయటికొచ్చింది. పరీక్ష ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం జవాబులతో సహా తమకు అందిందని

...మిగతాది 2 లో

# నేడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం



**జయభేరి, ఢిల్లీ:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కౌన్సిల్ సమావేశం శనివారం (జూన్ 22) జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా నిర్మలా సీతారామన్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తేదీని ప్రకటించింది. ఈ జీఎస్టీ కౌన్సిల్

...మిగతాది 2 లో

# హడావిడి తప్ప ఆచరణ ఏదీ

...మిగతాది 2 లో

# నాలుగో ఎమ్మెల్యే..?



**జయభేరి, హైదరాబాద్, జూన్ 22:**

తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్ జోరుగా కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కారులో ఉక్కపోత తట్టుకోలేక హస్తం గూటికి చేరుకుంటున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో మొదలైన ఈ పర్వం తాజాగా మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో మరోసారి ఈ అంశం తెరమీదకు వచ్చింది.పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర ఈ ఉదయం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 20 మంది ఎమ్మెల్యేలు కారు

...మిగతాది 2 లో

# బెంగళూరు కేంద్రంగా నగరానికి డ్రగ్స్




**జయభేరి, హైదరాబాద్, జూన్ 22:**

బెంగళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తితో పాటు నలుగురు వినియోగదారులను టీజీన్యాబ్, సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.1.53లక్షల విలువ చేసే 12.72 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

...మిగతాది 2 లో

మాతృ యజ్ఞం



కీ.శే. వేములగట్టు సుగుణాబాయి
మరణం : 14-06-2024
కార్యస్థలం తునికి ఖాల్సా

స్వస్తి శ్రీ క్రోధినామ సంవత్సర జేష్టశుద్ధ అష్టమి శుక్రవారం
14-06-2024 రోజు మ. 3.24 ని.లకు మా తల్లి గారైన
కీ.శే. వేములగట్టు సుగుణాబాయి
పరమపదించినారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది : 23-06-2024 ఆదివారం ఏక దశహం,
తేది : 24-06-2024 సోమవారము వృషభోత్సవం,
ఏకోతిష్టము, షోడహము,
తేది : 25-06-2024 మంగళవారము
సపిండికరణం, ఊనమాసికం, మహదాశీర్వచనం
కావున తామెల్లరు సకాలంలో విచ్చేసి వారి ఆత్మకు శాంతి
చేకూర్చగలరని కోరుచున్నాము ...
ఇట్లు
వేములగట్టు మురళీధర్‌రావు మరియు కుటుంబ సభ్యులు

ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## సీబీఎన్ తో పోటీ పడే అవకాశం

30వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ చెప్పారు. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినేట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించామన్నారు.గతంలో తాను 12 గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడిని.. కానీ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి 18 గంటలు పని చేసే వ్యక్తిఅని చెప్పారు. ఒక ఆటగాడి నైపుణ్యం తెలియాలి అంటే మరొక మంచి ఆటగాడితో పోటీ పడాలన్నారు. ఇప్పుడు ఏపీలో సీఎంగా చంద్రబాబు ఉన్నారని.. దీంతో తనతో సహా రాష్ట్రంలోని అధికారులంతా అంతే ధీటుగా 18 గంటలు పని చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మూడోతరం అయిన లోకేష్ బాబు, భరత్ రాజకీయాల్లో, సంక్షేమంలో ఎలాంటి మార్క్ కన బరుస్తారో చూడాలని సీఎం రేవంత్ తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో హెల్త్ టూరిజం హబ్ గురించి ప్రకటించారు. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుందన్నారు. ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుందని.. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్ కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ ఈ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషమని రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆసుపత్రి నిర్మాణం చేశారన్నారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా చేశారని అభినందించారు. పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన మనల్ని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారన్నారు. పేదలకు క్యాన్సర్ వ్యాధి నుంచి బయటపడేయడానికి, వైద్యరంగానికి విశేష కృషి చేసిన ఎన్టీఆర్ బసవతారం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## కదులుతున్న నీట్ డొంక

బిహార్‌లో అరెస్టయిన నలుగురు పోలీసులకు వెల్లడించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం లేపుతోంది.బీహార్‌లో అరెస్టయిన నలుగురు విద్యార్థుల్లో అభిలాషి అనురాగ్ యాదవ్, అతని మామ దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సికందర్‌తో పాటు మరో ఇద్దరు విద్యార్థులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారు. కోటాలోని కోచింగ్ హబ్‌లో పరీక్షకు సిద్ధమవుతున్న అనురాగ్ యాదవ్‌కు అతని మామ సికందర్ ఫోన్ చేసి పేపర్ లీక్ చేసేందుకు ప్లాన్ చేశానని, వెంటనే ఇంటికి రావాలని కోరాడు. వెంటనే మామవద్దకు చేరుకున్న అనురాగ్ యాదవ్ రాత్రికి రాత్రే జవాబులను చదివి కంఠస్థం చేశాడు. మరుసటి రోజు పరీక్ష కేంద్రానికి వెళ్లిన అనురాగ్ యాదవ్‌కు సరిగ్గా కంఠస్థం చేసిన ప్రశ్నలే రావడంతో అన్ని సమాధానాలు రాశాడు. అనురాగ్‌తోపాటు అతని స్నేహితులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ అనే మరో ఇద్దరు విద్యార్థులకు కూడా సికిందర్ పేపర్ అందించాడు. వీరు నీట్ క్లియర్ చేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.30 నుంచి 32 లక్షల వరకు వసూలు చేసినట్లు నిందితులు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించడంతోపాటు.. ఇదే విషయాన్ని రాత పూర్వకంగా రాసిచ్చారు. దీంతో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మరింత తీవ్రమైంది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 14 మందిని అరెస్టు చేశారు. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది.

## నాలుగో ఎమ్మెల్యే..?

దిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దీంతో ఎవరెవరు హస్తం గూటికి చేరుకుంటారనే చర్చ మొదలైంది.ఇదిలా ఉండగా ఈ ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలవడం చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పార్టీ అన్ని వైపుల నుంచి ఆపరేషన్ ఆకర్ష్ ప్రారంభించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. త్వరలో లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే చర్చ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ వాదనలను కొట్టిపారేసింది. జానారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి లక్ష్మారెడ్డి వెళ్లారని పార్టీ శ్రేణులు తెలిపాయి. పోచారం వంటి సీనియర్ నేతలే కారు దిగిపోతుండటంతో ఉప్పల్ ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరడంలో ఆశ్చర్యం లేదని మరికొందరి వాదన.ఎలా ఉన్నా బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేసి కారును షెడ్డుకు తరలించాలనే కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి వారు వేస్తోన్న అడుగులు ఈ వాదనలకు బలం చేకూర్చుతుంది. కేసీఆర్, కేటీఆర్ అహంకారమే ఆ పార్టీకి శాపంగా మారిందని మరికొందరి వాదన.ఉప్పల్ ఎమ్మెల్యే బాటలోనే గద్వాల ఎమ్మెల్యే బండ కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌లు నడుస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే జరిగితే చివరికి కేటీఆర్, కేసీఆర్ మాత్రమే ఆ పార్టీలో ఉంటారనే వాదన కూడా వినిపిస్తోంది.

## నేడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు, కౌన్సిల్ సభ్యులు, ఆర్థిక సహాయ మంత్రి, కేంద్ర, రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారులు హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరవుతున్నారు. అంతకుముందు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం 2023 అక్టోబర్ 7న జరిగింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందేలపై 28 శాతం సుంకం విధించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. ఆ తర్వాత మార్చి జీఎస్టీ సమావేశంలో ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వచ్చే ఆదాయంపై విధించిన 28 శాతం పన్ను సమీక్షను కౌన్సిల్ వాయిదా వేసింది.

## బెంగళూరు కేంద్రంగా డ్రగ్స్


పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన గోసంగి వెంకటసాయిచరణ్ బెంగళూరులో డిగ్రీ పూర్తిచేసి, డ్రగ్స్ దందా మొదలు పెట్టాడు. హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్ నగరాల్లో డ్రగ్ సరఫరా చేస్తున్నాడు. బెంగళూరు కేంద్రంగా చిన్న చిన్న కవర్లలో ఎండీఎంఎను ప్యాక్ చేసి, ప్రైవేటు ట్రావెల్ బస్సుల ద్వారా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటాడు. ఇందుకోసం డ్రైవర్లకు వంద రూపాయలు ఇచ్చి ఫలానా వ్యక్తులు వచ్చి తీసుకుంటారు, వారికి ఈ పార్శిల్ ఇవ్వమని చెబుతాడు. ట్రావెల్స్ డ్రైవర్లు వాటిని నగరానికి చేరుకున్న తరువాత సాయిచరణ్ సూచన మేరకు కస్టమర్లకు అప్పగిస్తారు. డ్రగ్స్ దందాపై నిఘా పెట్టిన టీజీన్యాబ్ పోలీసులు ఈ నెల 21న మాదాపూర్‌లో రెగ్యులర్ కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు వచ్చిన సాయిచరణ్‌ను పట్టుకున్నారు. డ్రగ్స్ కొనుగోలుకు వచ్చిన మాదాపూర్‌కు చెందిన మల్లిక్ లోకేశ్, సందీప్‌రెడ్డి, కూపట్‌పల్లికి చెందిన రాహుల్, సనత్‌నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యంను రిమాండ్‌కు తరలించారు.

**ప్రైవేటు ట్రావెల్ సంస్థలకు నోటీసులు..**

గుర్తు తెలియని వ్యక్తులు అందించే అనధికారిక పార్శిల్‌స్‌ను తీసుకుంటే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని పోలీసులు ట్రావెల్స్ సంస్థలకు నోటీసులు జారీచేశారు. బస్సుల్లో లగేజీని తనిఖీ చేసేందుకు డాగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిందితుడు సాయిచరణ్ ప్రధానంగా మార్నింగ్ స్టార్, రాజేశ్వరి, జీవీఆర్, చెర్రీ ట్రావెల్స్ ద్వారా డ్రగ్స్ పార్శిల్స్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# అభివృద్ధి భాగస్వామి బంగ్లాదేశ్

▶▶ మొదటిపేజీ తరువాయి



భారత్ వచ్చిన బంగ్లా ప్రధానమంత్రి షేక్ హసీనాతో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్యపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. మయన్మార్ పరిణామాలతోపాటు రోహింగ్యా కాందిశీకుల అంశంపై అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. భారత్‌కు బంగ్లాదేశ్ అతిపెద్ద అభివృద్ధి భాగస్వామి అని మోదీ అన్నారు. బంగ్లాదేశ్‌తో సంబంధ బాంధవ్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా సీఈపీఏపై చర్చలు ప్రారంభించామని నిర్ణయించినట్లు తెలిపారు. రక్షణ రంగంలో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించామన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, సైనిక దళాల ఆధునీకరణ విషయంలో ఇరుదేశాలు సహకరించుకోవాలని ఆకాంక్షించారు.

**భారత్ విశ్వసనీయ మిత్రదేశం: హసీనా**

ఇండోపసిఫిక్ కార్యక్రమంలో చేరాలన్న బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మోదీ చెప్పారు. ''ఇరు దేశాల బంధానికి పౌరుల మధ్య సంబంధాలే పునాది. వైద్య సేవల కోసం వచ్చే బంగ్లా పౌరులకు ఈమెడికల్ వీసా కల్పిస్తాం. బంగ్లాదేశ్‌లోని రంగపూర్‌లోని కొత్తగా అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నాం. 1996 నాటి గంగా నది నీటి ఒప్పందాన్ని నవీకరించడానికి సాంకేతిక చర్చలు ప్రారంభిస్తాం.

తీస్తా నది పరిరక్షణ, నిర్వహణపై చర్చించడానికి బంగ్లాదేశ్‌కు టెక్నికల్ టీమ్‌ను పంపుతాం'' అని ప్రధాని వివరించారు. సుస్థిరమైన, సౌభాగ్యవంతమైన, ప్రగతిశీల బంగ్లాదేశ్‌ను బంగబంధు షేక్ ముజిబుర్ రెహమ్‌న్ కలలుగన్నారని, ఆ కలను నిజం చేయడానికి తమవంతు సహకారం అందిస్తామని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత్ తమకు అతి పెద్ద పొరుగు దేశమని, తమకు అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని షేక్ హసీనా పునరుద్ఘాటించారు. భారత్‌తో సంబంధాలకు అత్యధిక విలువ ఇస్తున్నామని ఆమె పునరుద్ఘాటించారు.

**10 ఒప్పందాలపై సంతకాలు**

డిజిటల్, సముద్రయానం, సముద్ర వనరుల వినియోగం, రైల్వే, అంతరిక్షం, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్య వంటి కీలక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యంగా భారత్, బంగ్లాదేశ్ శనివారం 10 ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో షేక్ హసీనా భేటీ**

న్యూఢిల్లీ: వేర్వేరు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా భారత్, బంగ్లాదేశ్ వేగంగా ముందుకు సాగుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. నూతన రంగాల్లో సహకారం పెంపొందించుకుంటున్నాయని, రానున్న రోజుల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలను ఈ సహకారమే నిర్ణయిస్తుందని చెప్పారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా సమావేశమయ్యారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను బలోపేతం చేసుకొనేలా కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చారు. షేక్ హసీనాను కలవడం సంతోషంగా ఉందని ముర్ము పేర్కొన్నారు.

# 14 రోజులు దర్శనం ఇవ్వని జగన్నాథుడు



▶▶ మొదటిపేజీ తరువాయి

భక్తులు దర్శనం చేసుకోలేరు.జ్యేష్ఠ మాసంలోని పౌర్ణమి రోజున సహస్త్రధార స్నానం చేస్తారు. ఆ రోజును "దేవ స్నాన పూర్ణిమ" అని కూడా అంటారు. ఈ రోజున ఆలయ ప్రాంగణంలోని భారీ సంఖ్యలో భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమను జూన్ 22, 2024 శనివారం జరుపుకుంటారు.ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసం పౌర్ణమి రోజున పూరీలోని జగన్నాథ దేవాలయంలో జగన్నాథుడు, అతని సోదరుడు బలరాముడు, సోదరి సుభద్రలకు సహస్త్రధార స్నాన ఆచారం నిర్వహిస్తారు. ఈ ఆచారం చాలా వైభవంగా జరుపుతారు.

సహస్త్ర ధార స్నానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ఆచారం జగన్నాథుని రథయాత్రకు నిర్వహించే ప్రధాన ఆచారాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ క్రతువు కోసం స్వామిని 108 కుండలలో పవిత్ర జలం నింపి స్నానం చేస్తారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమ జూన్ 22న వచ్చింది. అందుకే ఈ రోజు జగన్నాథుడు, అన్న బలభద్రుడు, సోదరి సుభద్రలకు సహస్త్ర ధార స్నాన ఆచారం నిర్వహించబడుతుంది.దేవ స్నాన పూర్ణిమ రోజున జగన్నాథుడు, బలభద్రుడు ,సుభద్ర దేవిని భక్తుల ముందు స్నానం చేయించడానికి తీసుకువస్తారు. ఈ ఆచారాన్ని చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు పూరీకి చేరుకుంటారు. ఈ సమయంలో దేవతా మూర్తులను స్నాన మండపానికి తీసుకొచ్చి ఆలయంలోని పవిత్ర బావిలోని నీటిలో స్నానం చేయిస్తారు. ఈ కాలంలో అనేక రకాల మతపరమైన ఆచారాలు కూడా జరుగుతాయి. పూలు, గంధం, కుంకుమ, కస్తూరి వంటి వాటిని 108 కుండల నీటిలో కలిపి స్నానం చేయడం వల్ల స్నానం చేసే నీరు మరింత స్వచ్ఛంగా.. సువాసనగా మారుతుంది.స్నాన ఆచారం పూర్తయిన తర్వాత జగన్నాథునికి సాధారణ వస్త్రధారణ చేస్తారు. జగన్నాథుడు సాధారణ దుస్తులు ధరించి ఉంటాడు. మధ్యాహ్నం సమయంలో జగన్నాథుడిని వినాయకుని రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. భగవంతుని వేషధారణలో జరిగే ఈ ఆచారం చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. భగవంతుడు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా వారి పట్ల భక్తిని ప్రదర్శించడం ద్వారా భగవంతుని అనుగ్రహం పొందడం ఈ ఆచారం యొక్క ప్రధాన లక్ష్యం.సహస్త్రధార స్నానం అనంతరం జగన్నాథ ఆలయంలో స్వామివారి దర్శనానికి అనుమతి ఉండదు. ఈ సమయంలో ఆలయ ప్రధాన గర్భగుడి తలుపులు మూసివేయబడతాయి. భక్తులు స్వామిని దర్శనం చేసుకోలేరు. ఇది దేవుని విశ్రాంతి సమయంగా పరిగణించబడుతుంది. ఇలా చేయడం వెనుక ఉన్న నమ్మకం ఏమిటంటే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిలు స్నానం చేయడం వల్ల జ్వరం వస్తుందని నమ్ముతారు. ఈ కాలాన్ని 'అనవాసర' లేదా 'అజ్ఞాతవాసం అని అంటారు. ఇలా 14 రోజుల పాటు స్వామివారి గర్భగుడి తలుపులు ముసి వేస్తారు.ఈ 14 రోజులు జగన్నాథ, బలరామ, సుభాద్రల విగ్రహాలను పునఃస్థాపన చేస్తారు. విగ్రహాలకు చందనం పూత పూసి ప్రత్యేక మందులతో చికిత్స చేస్తారు. ఇది దేవుని కొత్త జీవితాన్ని పొందే సమయంగా పరిగణించబడుతుంది.14 రోజుల తర్వాత ఆషాఢ మాసంలోని శుక్ల పక్షం ప్రతిపాద తిథి నాడు 15వ రోజున ఆలయ తలుపులు తిరిగి తెరవబడతాయి. ఈ ప్రత్యేకమైన రోజును కన్నుల పండుగగా జరుపుకుంటారు. ఈ ఆచారంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు కొత్త కన్నులు అందించబడతాయి. ఈ రోజున నేత్రోత్సవం అని అంటారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుంది. ఈ రథయాత్ర సమయంలో భగవంతుడు జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర దేవి భారీ రథాలలో కూర్చుని వీధుల్లో ఊరేగుతారు. ఈ భారీ రథాలను వందలాది మంది భక్తులు లాగుతారు.

# హడావిడి తప్ప ఆచరణ ఏదీ

**జయభేరి, హైదరాబాద్, జూన్ 22:**

కేబినెట్‌లో చర్చించి రుణామాఫీ చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడి చేస్తోందని బీఆర్ఎస్ విమర్శించింది. రూ.31 వేల కోట్లలో ఒక్క రూపాయి రుణమాఫీ చేయకుండానే దానిని పెద్దా సాయంగా రేవంత్ ప్రభుత్వం బూతద్దంలో చూపుతుందని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. క్యాబినెట్ చర్చ కాగానే రుణమాఫీ చేసినట్లు ఒక సెక్షన్ మీడియా చిత్రీకరిస్తున్నదని.. పిల్ల పుట్టక ముందే మీడియా కుల్లకుడుతుందని విమర్శించారు. ఏడు నెలల తర్వాత చర్చ జరిగినందుకు సిగ్గుపడాలి .. దాని గురించి మీడియా వార్తలు రాయాలని బీఆర్ఎస్ సలహా ఇచ్చారు. ఆలు లేదు చూలు లేదు .. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు మీడియా తీరు ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రోజు ఆలస్యమైతే మీడియా, మేధావులు ఒంటి కాలి మీద లేచేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. రైతాంగం ఉసురుపోసుకుంటున్నా ఇప్పుడు మేధావులు నోరెత్తడం లేదు .. మీడియా ప్రభుత్వానికి మద్దతు పలుకుతుందన్నారు. డిసెంబరు 9 రుణమాఫీ అని చెప్పి .. హోల్ సేల్ గా 70 లక్షల మంది రైతులను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ వట్టి బోగస్ .. 5 ఎకరాల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ అంటున్నారు.. 5 ఎకరాలు ఉన్న వారికి రూ.2 లక్షల రుణం ఏ బ్యాంకు ఇవ్వదన్న విషయం తెలియదా అని ప్రశ్నించార. అసలు ఏ క్యాటగిరీ, ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేస్తుందో ప్రభుత్వం వివరాలు విడుదల చేయాలని డిమాండ్ లచేశారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయిందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు అయిపోయిందన్నారు. ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ను స్థాయికి మించి దుర్భాషలాడారని.. రైతుబంధు రెండు పంటలకు కాదు మూడు పంటలకు ఇస్తానన్నాడని రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ.15 వేలు కాదు, పాత రూ.10 వేలు రైతుబంధు కు కూడా గతిలేదన్నారు. ఏరొక్క పౌర్ణమి నాటికి నదులు పారాలి కానీ.. పుణ్యాత్ములు అడుగుపెట్టిన కాలమహిమో ఏమో ఇంత వరకు నీళ్లు రాలేదన్నారు. రైతుభరోసా మార్గదర్శకాల కోసం జులై 15 వరకు గడువు పెట్టుకున్నారు .. అప్పటికి వానాకాలం సగం అయిపోతుందన్నారు. పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకూ రైతుబంధు ఇచ్చామని.. కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. మరి ఇటీవల ఇచ్చాం అని చెప్పుకుంటున్న రైతుబంధు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. 68.99 లక్షల మంది రైతులకు బీఅర్ఎస్ పార్టీ 11 విడతల్లో రూ.72,815 కోట్లు ఒక్క రైతుబంధు కింద రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఒక కోటి 52 లక్షల ఎకరాలకు రైతుబంధు వర్తింపచేశామని.. లోపాలను గత ఏడు నెలలలో కాంగ్రెస్ ఎందుకు సరిచేయలేదని ప్రశ్నించారు. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 2603 క్లస్టర్లు ఉన్నాయని.. తెలంగాణ ప్రభుత్వ డాటా ఆధారంగానే కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన అమలు చేసిందని గుర్తుచేశారు. కొన్ని క్లస్టర్లను ఎంపిక చేసుకుని కలెక్టర్లతో రాండమ్ గా సర్వే చేస్తే ఒక్క రోజులో పూర్తవుతుందన్నారు. ఆధునిక యుగంలో అన్ని అవకాశాలు ఉన్నా రైతులకు రైతుబంధు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తుందని విమర్శించారు. రైతుభీమా, ఉచిత కరంటు, పంటల కొనుగోళ్లు, విత్తనాలు, ఎరువుల సబ్సిడి, మైనర్ ఇరిగేషన్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో రైతాంగానికి అండగా నిలిచామని.. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధితో తెలంగాణ తలసరి ఆదాయం పెరిగి దేశానికి తోడ్పాటు అందించిందన్నారు. తెలంగాణలో 92.5 శాతం భూమి 5 ఎకరాల లోపు రైతుల వద్దనే ఉంది .. 5 నుండి 6 శాతం రైతుల వద్ద పది ఎకరాల వరకు భూమి ఉందన్నారు. రుణమాఫీ, రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల తరపున రైతులతో కలిసి పోరాడతామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు

# రుణమాఫీ ప్రకటనలతో హర్షం వ్యక్తం చేసిన రైతులు

- రైతుల పక్షపాతి రేవంత్ రెడ్డి సర్కార్
- గత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ పేరిట మోసం చేసింది.
- ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రి పొన్నం చిత్రపటాలకు పంచామృతాలతో అభిషేకం



**జయభేరి, హుస్నాబాద్:**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పంచామృత అభిషేకం చేయడం జరిగినది. క్యాబినెట్ మీటింగ్ లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ గురించి క్యాబినెట్ ఆమోదం పొందినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు పంచామృతంతో అభిషేకం చేయడం జరిగినది. గత ప్రభుత్వాలు రైతులకు రుణమాఫీ చేస్తాను అని ఐదు సంవత్సరాలు కాలయాపన చేసి లక్ష రూపాయలు రైతు రుణమాఫీ చేయని గత ప్రభుత్వము.

ఈరోజు మీరు ఎప్పుడు రైతు రుణమాఫీ చేస్తారు అని డేట్ చెప్పండి అని చెప్పేసి మాట్లాడడం సిగ్గుచేటు అని ఏదైతే కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందో మాట తప్పకుండా ఆగస్టు 15 లోపు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసే విధంగా విధివిధానాలను రూపొందించినందుకు రేవంత్ రెడ్డి మంత్రి వర్గం బృందానికి కృతజ్ఞత తెలుపుతూ హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రైతుల పక్షాన అభినందనలు తెలియజేయడం జరిగినది.

కార్యక్రమంలో టిపిసిసి కేడం లింగమూర్తి హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్ మున్సిపల్ కౌన్సిలర్స్ వల్లపు రాజు భూక్య సరోజన పున్న సది లావణ్య వేన్న రాజు పోతుగంటి బాలయ్య సంఘ కుమార్ బిక్యా నాయక్ రమేష్ నాయక్ తిరుపతి నాయక్ గాలిపల్లి శ్రీనివాస్ సుంకరి ప్రదీప్ కేశవేణి రమేష్ కోడి ముంజ మహేందర్ దండి లక్ష్మి నాయిని రజిత కమలమ్మ పుదారి శ్రీనివాస్ గౌడ్ విక్రమ్ మరియాల రాజిరెడ్డి సుక్క తిరుపతి బి కే నాయక్ వేల్పుల సంపత్ కైలు నాయక్ గోపాల్ స్వామి దండి కొమురయ్య బినవేని కనకయ్య మాటూరి బాలయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డిని వినతి పత్రం

**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ కి చెందిన గీతా పారిశ్రామికులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డిని మర్యాదపూర్వకముగా కలిసి వారి సమస్యలను వినతి పత్రంలో ఇచ్చారు. గీతా పారిశ్రామికుల సమస్యలు సర్వే నెంబర్ 278లో గతంలో 5 ఎకరాల భూమిని వారికి కేటాయించారు అందులో ఈత చెట్లు పెంచుకున్నామని, కాని ఈ భూమి మధ్యలో వాకింగ్ ట్రాక్ మరియు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించారని, వాటివలన అ చెట్లు మొత్తం పాడైపోయాయని, ఎమ్మెల్యే కి వారి మనవి ఏమనగా గీతా పారిశ్రామికులకు దానికీ బదులుగా వేరేచోట 5 ఎకరాల భూమిని కేటాయించాలని గీతా పారిశ్రామిక సహకార సంఘం వారు కొరారు. ఎమ్మెల్యే మాట్లడుతూ... సమస్యపై సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి మీ సమస్యను తప్పక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో BRS పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, అధ్యక్షులు కాసుల అనంద్ గౌడ్, R రామ చంద్ర గౌడ్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు రాగిరు నరసింహ గౌడ్, అనంద్ రాజ్ గౌడ్, అంజయ్య గౌడ్, నాథం గౌడ్, రాములు గౌడ్, ఆశోక్ గౌడ్, శశికాంత్ గౌడ్, శ్రవణ్ కుమార్ గౌడ్, చెన్నయ్య గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## 40 లక్షల వ్యయంతో కార్తికేయ నగర్ లో సిమెంట్ రోడ్లు



**జయభేరి, ఉప్పల్ :**

కార్తికేయ నగర్ వీధి నెంబర్ 9 మరియు 10 లలో 40 లక్షల రూపాయలతో ప్రారంభం కానున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. అలాగే మిగిలిన కార్తికేయ నగర్ రోడ్లన్నీ కూడా తొందర్లోనే శాంక్షన్ చేయించి రోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం డివిజన్ బారాస నాయకులు కార్యకర్తలు, డిప్యూటీ ఇంజనీర్ రూప, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఇంటలెక్చువల్ సెల్ కో కన్వీనర్‌గా యుద్ధవీర్ కట్టా



**జయభేరి, హైద్రాబాద్, జూన్ 22:**

గండమల్ల ఆనంద్ గౌడ్ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు యుద్ధవీర్ కట్టాను భారతీయ జనతా పార్టీ OBC మోర్చా తెలంగాణ రాష్ట్ర ఇంటలెక్చువల్ సెల్ కో కన్వీనర్ గా నియమించారు. ఈ నియామకం.జూన్ 26, 2024 నుండి అమలులోకి వస్తుంది. బీజేపీ భావజాలం, ఆదర్శాలకు అంకితమై, నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ మరియు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, తోటి కార్యకర్తలు మరియు పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని ఆనంద్ గౌడ్ అభిప్రాయపడ్డారు. తన ప్రాంతంలోని వెనుకబడిన వర్గాల ప్రజలచేత ఉద్యమాలు చేపట్టి ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి అన్ని వర్గాల ప్రజల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీని మరింత విస్తరించేందుకు యుధ్వీర్ కట్టా కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ఆనంద్ గౌడ్ ఆశిస్తున్నానని అన్నారు.

## మియాపూర్ 100, 101 సర్వే నెంబర్ లో ఉద్రిక్తత

**జయభేరి, రంగారెడ్డి:**

మియాపూర్ సర్వే నెంబర్ 100, 101 లో ని భూమి లో వేల మంది వచ్చి స్థలాలు కావాలని డిమాండ్ చేస్తూ బైటయించారు. శేరిలింగంపల్లి ఎమ్మార్వో , హుడా డీఎస్పీ, మియాపూర్ ఏసీపీ స్థలం సుప్రీం కోర్ట్ లో ప్రభుత్వనికి, ప్రవేట్ వ్యక్తులకు నడుస్తుందని వివరించారు. ఉన్న ప్రదేశాని నుండి మీ ప్రదేశానికి వెళ్లాలని కోరారు. కోర్టు పరిధి లో ఉన్నపుడు ఎవరు ఏమి చేయలేరు, అనవసరమైన కేసులు నమోదు జరుగుతాయని సూచించారు.

## జడ్పీ భేటీకి హాజరయిన మంత్రి కోమటిరెడ్డి

**జయభేరి, నల్గొండ :**




నల్లగొండ జిల్లా జడ్పీ సమావేశం హాట్ హాట్ గా కొనసాగుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో.. విత్తనాలు, ఎరువుల సమస్యలు సహా త్రాగునీరు, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఇతర సమస్యల మీద చర్చ జరిగింది. జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ఈ మీటింగ్ కు.. ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ నారాయణ రెడ్డి తో పాటు.. పలువురు ఎంఎల్ఏ లు, జడ్పీటీసీ లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తన సొంత గ్రామం బ్రాహ్మణ వెల్లంల లోనే మిషన్ భగీరథ నీళ్లు రావట్లేదని.. ఇక శివారు ప్రాంతాలు మిగతా గ్రామాల పరిస్థితి చెప్పనక్కర్లేదన్నారు. అప్పట్లో కాంట్రాక్టులు ప్రభుత్వంలో ఉన్నవారు అందన కాడికి దోచుకొని మిషన్ భగీరథను కమిషన్ భగీరథ గా మార్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ప్రాణం తీసిన అతివేగం

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 20 సమయం అందాజ అర్ధ రాత్రి 01.30 గంటలకు శ్రీనివాస నగర్ కాలనీ, బొడుప్పల్ నివాసి అయిన ఐత శ్రవణ్ కుమార్ S/o శ్యామ్ రావు (23) అను వ్యక్తి తన యొక్క యాక్టివా నంబర్ TS08JP3292 గల దానిపై డ్యూటి నిమిత్తం ఉప్పల్ నుండి మేడిపల్లి వైపు వెళ్తుండగా, అదే సమయంలో రాంగ్ రూట్ లో Activa Br.No. TS07 GM7870 గల దానిని నడుపు రైడర్ అతని బైక్ ను అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపి అతనికి గుద్దడంతో, శ్రవణ్ కుమార్ స్కూటీ మీద నుండి ఎగిరి క్రింద పడగా తలకు బలమైన రక్త గాయం అయ్యి అక్కడిక్కడే చనిపోయినాడు.

## బ్రాండ్లపై ధరల బాంబు

**జయభేరి, వరంగల్, జూన్ 22:**

తెలంగాణ ప్రభుత్వం మందుబాబులకు షాక్ ఇవ్వనుందా..? మద్యం ధరలను పెంచేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఓ పక్క రాష్ట్రంలో కావాల్సిన బ్రాండ్ల మద్యం, బీర్లు దొరకడం లేదని మందుబాబులు ఆందోళన చెందుతుంటే మరో పక్క మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది.సాధారణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్రంలో మద్యం ధరలు పెరుగుతూ ఉంటాయి. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో మద్యం ధరలను పెంచింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం ధరలను పెంచేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.అన్ని బ్రాండ్ల లిక్కర్ ధరల మీద 20 నుంచి 25 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. బీర్ల పైన రూ.10 నుంచి రూ.15 మేరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. ధరలను పెంచినట్లయితే.. ఏటా ప్రభుత్వానికి మూడు నుంచి మూడున్నర వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. వాస్తవానికి ఈ ఏడాది మార్చిలోనే ధరలను పెంచాల్సి ఉండగా.. లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదా పడినట్లు తెలుస్తోంది.ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.35వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఇప్పుడు ధరలను పెంచితే ఏటా దాదాపు రూ.40వేల కోట్ల రూపాయల వరకు ఆదాయం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని సంక్షేమ పథకాలకు వినియోగించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రతిపక్ష స్థానమైనా ఉంటుందా..?

**జయభేరి, హైదరాబాద్, జూన్ 22:**


నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్టు తయారైంది కేసీఆర్ పరిస్థితి. అధికారం ఉన్నపుడు ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఆయన తపన చివరికి ఆయన్నే మింగేసేలా తయారైంది. 2014 నుంచి ఇతర పార్టీల్లో గెలిచిన వారిని నయానో..భయానో బీఆర్ఎస్‌లో చేర్చుకుంటూ వచ్చారు.

2018లోపు దాదాపు తెలంగాణలో టీడీపీ లేకుండా చేశారు. ఈ తర్వాత 2023లోపు కాంగ్రెస్ ను కూడా ఖతం చేయాలని చూశారు. దాదాపు ప్రజల్లో కూడా ఆ అభిప్రాయం క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు. అయితే..రేవంత్ రెడ్డి చేతికి కాంగ్రెస్ పగ్గాలు వచ్చిన తర్వాత సీన్ మారిపోయింది. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. ప్రజలు ఇచ్చిన ఓటమిని గౌరవించకుండా అవకాశం దొరికిన ప్రతిసారీ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది.. మరో 6 నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారని చెప్పడం మొదలు పెట్టారు. నిజానికి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి ఇష్టపడలేదు. కానీ, ప్రభుత్వాన్నే కూల్చేస్తామంటే ఎవరికైనా తప్పదు. అందుకే కాంగ్రెస్ తో కలిసి నడుస్తామని అంటున్నవారిని రేవంత్ రెడ్డికి కలుపుకొని పోతున్నారు. బీఆర్ఎస్ 40 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంటే.. పార్లమెంట్ ఎన్నికల ముందు ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పుడు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ కూడా హస్తం కండువా కప్పుకున్నారు. పార్టీ ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాణ స్వీకారానికి మినహా అసెంబ్లీకి వచ్చింది లేదు. అయితే, ఇకపై వస్తానని ఆయన ప్రకటన చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెట్టేసరికి ఆయనకు ప్రతిపక్షహోదా కూడా దక్కేలా కనిపించడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ తో 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. మిగిలిన వారికి బీజేపీ గాలం వేస్తుందని తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉండాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది.

ఏది ఏమైనా రోజులు లేదంటే కొన్ని నెలల్లో అసెంబ్లీలో బీజేపీ కంటే బీఆర్ఎస్ తక్కువ సంఖ్యా బలానికి పడిపోతుందని గులాబీ నేతలే చెబుతున్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో చాలా స్థానాల్లో డిపాజిట్లు కూడా రాకపోవడంతో ఇక బీఆర్ఎస్ కు భవిష్యత్ లేదని ఫిక్స్ అయ్యారట. అందుకే ఎవరి దారి వారు చూసుకుంటున్నారని తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం ఒక ఎత్తు అయితే.. ఓటమికి బీఆర్ఎస్ అధినేతే కారణమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఆయనే స్వయంగా ఓటు బ్యాంక్ సిఫ్ట్ చేశారనే వాళ్లు కూడా ఉన్నారు. దీంతో.. పార్టీకి భవిష్యత్ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మెజారిటీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డితో మంతనాలు మంతనాలు జరుపుతున్నారు.వారంతా హస్తం గూటికి చేరే అవకాశం ఉంది. మిగిలిన వారు టైం చూసి బీజేపీలో చేరే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. కేసీఆర్ ఫిరాయింపులను అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

అధికారంలో ఉన్నపుడు పార్టీ నేతలకు అందుబాటులో లేకుండా.. ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా.. ఇప్పుడు తలపట్టుకుంటే ప్రయోజనం ఏంటనే వారు కూడా ఉన్నారు. కనీసం అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినపుడైనా.. ప్రజల్లో తిరిగితే బాగుండేదనే అభిప్రాయాన్ని ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమిని గౌరవిస్తున్నామని కూడా చెప్పకపోతే.. ప్రజలు ఆదరించరు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అసెంబ్లీకి వెళ్లకుండా, ఒక ప్రెస్ మీట్ పెట్టకుండా, ప్రజల్లోకి వెళ్లకుండా.. లోక్‌సభ ఎన్నికల సమయానికి బస్సు యాత్ర చేస్తే ప్రజలు ఎందుకు నమ్ముతారు? గెలుపు ఓటములు పక్కన పెడితే.. ప్రతిపక్షమే లేకుండా చేయాలనే ప్రయత్నం ఇపుడు బీఆర్ఎస్ పార్టీని నిలువునా దహించేస్తుంది. చూస్తుండగా పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నా.. ప్రశ్నించే సాహసం చేయలేని పరిస్థితి కేసీఆర్ కు ఎదురైంది. ఒకవేళ ప్రశ్నిస్తే.. ఆ ప్రశ్నలకు ముందు కేసీఆరే సమాధానం చెప్పాలి.



# రెండు డ్రెస్సులు.. రూ.105 కోట్లు..

**కేన్స్‌లో అగ్గి పుట్టించిన ఈ ఇండియన్ నటి ఎవరో తెలుసా?**

**ఓ ఇండియన్ నటి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో అగ్గి పుట్టించింది. కేవలం రెండే రెండు డ్రెస్సులు వేసుకుంది. కానీ వీటి విలువ ఏకంగా రూ.105 కోట్లు కావడం విశేషం.**

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రపంచవ్యాప్తంగా సినీ తారల తళుకు బెళుకులు సహజమే. ఎన్నో రకాల డ్రెస్సులు.. వాటి గురించి వింతలు, విశేషాలు కూడా ఎన్నో. కానీ ఓ ఇండియన్ నటి మాత్రం అందరినీ షాక్ కు గురి చేసింది. ఆమె వేసుకుంది రెండే రెండు డ్రెస్సులు అయినా.. వాటి విలువ ఏకంగా రూ.105 కోట్ల అని తెలిసి అందరూ నోరెళ్లబెట్టారు.

**ఊర్వశి రౌతేలానా మజాకా?**

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాకు ఈ ఘనత దక్కుతుంది. ఈసారి కేన్స్ రెడ్ కార్పెట్ పై ఎంతోమంది ఇండియన్ తారలు మెరిశారు. ఐశ్వర్య రాయ్ తోపాటు కియారా అద్వానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, శోభితా దూళిపాళ్ల, అదితి రావ్ హైదరీ, 11 ఏళ్ల తర్వాత తొలిసారి ప్రీతి జింటాలాంటి వాళ్లు అక్కడికి వెళ్లారు. ఇక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సెర్ నాన్సీ త్యాగి అయితే స్వయంగా తాను డిజైన్ చేసిన చీరలోనే హాజరైంది.

వీళ్లందరూ ఒకెత్తయితే.. ఊర్వశి రౌతేలా మరో ఎత్తు. ఆమె రెండు రోజుల పాటు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్ పై మెరిసింది. తొలిరోజు ఆమె ఓ పింక్ గౌన్ లో కనిపించింది. ఆ గౌను ఖరీదెంతో తెలుసా? అక్షరాలా రూ.47 కోట్ల అని డీఎన్ఏ ఇండియా రిపోర్టు వెల్లడించింది. ఈ కస్టమ్ మేడ్ గౌన్ ధర తెలిసి అందరూ షాక్ తింటున్నారు. ఓపెనింగ్ సెర్మనీలో ఆమె ఈ గౌన్ వేసుకుంది.

అయితే ఈ గౌను ధరపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిజానికి ఈ డ్రెస్ ఖరీదు రూ.7 కోట్లే అని కూడా అంటున్నారు.

**మరో గౌను రూ.58 కోట్లు..**

ఇక అదే కేన్స్ లో నాలుగో రోజు ఊర్వశి రౌతేలా మరింత ఖరీదైన డ్రెస్ లో వెళ్లి ఆశ్చర్యపరిచింది. ఈసారి బ్లాక్ అండ్ వైట్ కస్టమ్ మేడ్ డ్రెస్ ధర ఏకంగా రూ.58 కోట్లు అని కూడా అదే డీఎన్ఏ రిపోర్టు తెలిపింది. అయితే ఈ డ్రెస్ ధరపైనా ఇంకా స్పష్టత లేదు. ఆ లెక్కన రెండు డ్రెస్సులు కలిపి రూ.105 కోట్లు అయ్యాయి. మామూలుగా లక్షల్లో డ్రెస్సులు చూస్తేనే కళ్లు బైర్లు కమ్ముతాయి. అలాంటిది ఊర్వశి ఇలా కోట్లలో డ్రెస్సులు వేసుకెళ్లడం అసలు ఊహకు కూడా అందనిదే.

ఆ మధ్య తన బర్త్ డే సందర్భంగా ఏకంగా రూ.3.5 కోట్ల విలువైన కేక్ కట్ చేసి ఆశ్చర్యపరిచిన ఆమె.. ఇప్పుడు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో కోట్ల డ్రెస్సులతో షాక్ కు గురి చేసింది. ఇక ఇదే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించిన కియారా అద్వానీ కూడా పింక్, బ్లాక్ డ్రెస్ లో కనిపించింది. ఆ డ్రెస్ కంటే ఆమె ధరించిన రూ.30 కోట్ల విలువైన నెక్లెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇక 11 ఏళ్ల తర్వాత మళ్లీ కేన్స్ లో అడుగుపెట్టిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా కూడా లక్షల ఖరీదైన డ్రెస్సే వేసుకుంది. ఆమె డ్రెస్ ఖరీదు రూ.5.5 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఐశ్వర్య రాయ్ సింపుల్ గా రూ 1.8 లక్షల విలువైన కార్డెలియా జంప్‌సూట్ లో వచ్చింది. ఆమె డ్రెస్సింగ్, చేతికి కట్టుపై ఈసారి భారీగానే ట్రోలింగ్ జరిగిన విషయం తెలిసిందే.






# సెమీస్‌లో టీమిండియా

ఐసీసీ ట్రోఫీ వేటలో విజయాలతో దూసుకెళ్తున్న భారత్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. శనివారం జరిగిన సూపర్ 8 రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను టీమిండియా వణికించింది. భారీ ఛేదనలో కుల్దీప్ యాదవ్(3/19), జస్ప్రీత్ బుమ్రా(2/13)లు విజృంభించడంతో 50 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. తొలు హార్దిక్ పాండ్యా(50 నాటౌట్), విరాట్ కోహ్లీ(37) మెరుపులతో మెగా టోర్నీలో రికార్డు స్కోర్ చేసిన రోహిత్ సేన ఆ తర్వాత ప్రత్యర్థిని కట్టడి చేసి.. గ్రూప్ 1 నుంచి దర్జాగా సెమీస్ బెర్తు కైవసం చేసుకుంది. అంటిగ్వాలో విజయంతో బంగ్లాదేశ్‌పై టీమిండియా విజయాల రికార్డు 13కు పెరిగింది. వరల్డ్ కప్ లీగ్ దశలో ఓటమెరుగని టీమిండియా సూపర్ 8లోనూ రఫ్ఫాడిస్తోంది. తొలి పోరులో అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసిన రోహిత్ సేన రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. 197 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బంగ్లాకు అదిరే ఆరంభం లభించలేదు. ఓపెనర్ తంజిద్ హసన్(29)ధాటిగా ఆడినా హార్దిక్ పాండ్యా ఎంట్రీతో సీన్ మారింది. తన తొలి ఓవర్లోనే లిట్టన్ దాస్(10)ను ఔట్ చేసిన పాండ్యా టీమిండియాకు బ్రేకిచ్చాడు.

ఆ తర్వాత చైనామన్ కుల్దీప్ యాదవ్ వికెట్ల వేట కొనసాగించి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టేశాడు. వరుస ఓవర్లలో తంజిద్, తౌహిద్ హృదోయ్(4)లను ఎల్బీగా ఔట్ చేసి తన మ్యాజిక్ చూపించాడు. ఇక ఒంటరి పోరాటం చేస్తున్న కెప్టెన్ నజ్ముల్ హుసెన్ శాంటో(40)ను ఔట్ చేసిన బుమ్రా బంగ్లాను మరింత కష్టాల్లోకి తోశాడు. ఆఖర్లో రిషద్ హొసెన్(24), మహ్మదుల్లా(13)లు బ్యాట్ ఝులిపించడంతో బంగ్లా 148కి పరిమితమై భారీ ఓటమిని తప్పించుకుంది. అంటిగ్వాలో టాస్ ఓడిన రోహిత్ శర్మ జట్టుకు శుభారంభమిచ్చాడు. ధనాధన్ ఆడిన హిట్‌మ్యాన్ షకీబుల్ హసన్ బౌలింగ్‌లో సిక్సర్, ఫోర్ బాదిన హిట్‌మ్యాన్ అదే ఓవర్లో జకీర్ అలీ చేతికి చిక్కాడు. దాంతో, 39 పరుగుల వద్ద టీమిండియా తొలి వికెట్ పడింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ(37), రిషభ్ పంత్(36)లు రన్ రేట్ 6కు తగ్గకుండా చూశారు. ముస్తాఫిజర్ వేసిన ఆరో ఓవర్లో కోహ్లీ కళ్లు చెదిరే సిక్సర్ బాదగా.. పవర్ ప్లేలో భారత్ వికెట్ నష్టానికి 53 రన్స్ కొట్టింది. కోహ్లీ, పంత్‌ల దూకుడుతో దూసుకెళ్తున్న భారత స్కోర్ బోర్డుకు తంజిమ్ హసన్ కళ్లెం వేశాడు. ఒకే ఓవర్లో కోహ్లీని బౌల్డ్ చేసిన హసన్.. మూడో బంతికి సూర్యకుమార్ యాదవ్(6)ను వెనక్కి పంపాడు. అయినా సరే పంత్ జోరు తగ్గించలేదు. ఒంటిచేత్తో సిక్సర్ బాది స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే. 11.4 ఓవర్‌లో పంత్ ఔటయ్యాక స్కోర్ వేగం తగ్గింది. శివం దూబే(34), హార్దిక్ పాండ్యా(50 నాటౌట్)లు కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఐదో వికెట్‌కు 53 రన్స్ జోడించి జట్టు స్కోర్ 160 దాటించారు. అఖర్లో పాండ్యా సిక్సర్లతో మోతమోగించాడు. ముస్తాఫిజుర్ వేసిన 20వ ఓవర్లో 3 ఫోర్లతో అర్ధ సెంచరీ సాధించాడు. దాంతో, టీమిండియా ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

# షాపింగ్.. ఇలా ప్లాన్ చేసేయండి బాస్

**షాపింగ్ మాల్స్ వెళ్తే.. ఏదో ఒకటి తీసుకోవాలని అనుకుంటాం. కానీ అక్కడకు వెళ్లిన తర్వాత తీసుకునే లెక్కే మారిపోతుంది. ఖర్చు తడిసిమోపెడవుతుంది. అందుకే సరిగా ప్లాన్ చేయాలి. అప్పుడే డబ్బులు తక్కువ ఖర్చు అవుతాయి.**






భారతదేశంలోని షాపింగ్ మాల్‌లు ఫ్యాషన్ దుస్తులు, ఎలక్ట్రానిక్స్ నుండి కిరాణా, వినోదం వరకు మీకు అవసరమైన ప్రతిదానికీ ఉపయోగపడతాయి. కానీ అక్కడకు వెళ్తే నిరంతరం ఎక్కువ ఖర్చు అవుతుంది. అయితే ఇకపై భయపడవద్దు.. కొంచెం ప్లాన్ చేసి.. కొన్ని తెలివైన వ్యూహాలతో తక్కువ ఖర్చుతో బయటకు రావొచ్చు.

మీ షాపింగ్ ట్రిప్‌ని ప్లాన్ చేయడం నుండి అమ్మకాల వ్యూహాల నుంచి బయటపడేందుకు ప్లాన్ చేయాలి. మిమ్మల్ని కొనాలి.. కొనాలి అనిపించే ప్రేరణ కలుగుతుంది. కానీ డబ్బు ఆదా చేయడానికి అవసరమైన చిట్కాలను పాటించాలి. మీరు నెక్ట్స్ టైమ్ మాల్‌కు వెళ్లినప్పుడు, చేయవలసినవి, చేయకూడనివి గుర్తుంచుకోండి.

మీరు షాపింగ్ మాల్ వెళ్లేటప్పుడు అవసరమైన వాటి జాబితాను రూపొందించండి. బడ్జెట్‌ను సెట్ చేయండి. మీ జాబితాకు కట్టుబడి ఉండండి. మిమ్మల్ని కొనాలని అని ప్రేరేపించే వాటి జోలికి వెళ్లకండి.

**యాప్స్ చూడండి..**

భారతదేశంలోని చాలా మాల్స్ స్టోర్ డైరెక్టరీలు, సేల్స్ ఫ్లైయర్‌లు, కూపన్‌లతో వారి స్వంత యాప్‌ను కలిగి ఉన్నాయి. మీరు వెళ్లే ముందు ఉత్తమమైన డీల్‌లను కనుగొనడానికి దీన్ని డౌన్‌లోడ్ చేయండి. మీరు మొదటిసారి డౌన్లోడ్ చేస్తే.. మీకు కూపన్స్ వచ్చే అవకాశం ఉంది. అంతేకాదు మీరు మీ ద్వారా ఇంకొకరిని రిఫరల్ కోడ్‌తో యాప్ డౌన్లోడ్ చేసేలా చేస్తే మీకు కూపన్స్ రావొచ్చు.

**క్యాష్ ఈజ్ కింగ్**

మీరు షాపింగ్ మాల్ వెళ్లినప్పుడు కార్డులు తీసుకెళ్లకండి. మీ కార్డ్‌ని స్వైప్ చేసినప్పుడు ఖర్చు అనుకోకుండానే పెరిగిపోతుంది. మీ బడ్జెట్‌ను గుర్తుంచుకోవడానికి నగదును ఉపయోగించాలి.

**సహనం ఉండాలి**

ధర ట్యాగ్ ద్వారా మోసపోకండి. ముఖ్యంగా పండుగ సీజన్‌లు లేదా క్లియరెన్స్ పీరియడ్‌లలో విక్రయాల కోసం వేచి ఉండండి.

**వీకెండ్స్ వద్దు**

వారాంతపు రోజుల్లో మాల్‌స్‌లోకి జనాలు విపరీతంగా వస్తారు. ఉదయం తరచుగా తక్కువ మందిని కలిగి ఉంటారు. మీరు మెల్లగా ధరలు చూసుకుంటూ కొనుగులో చేసేందుకు వారంలో మధ్యలో వెళ్లండి. ధరలను సరిపోల్చడానికి టైమ్ ఉంటుంది.

## చేయకూడనివి

**సేల్ సైరన్**

ఏదైనా అమ్మకానికి ఉన్నప్పుడు అది మీకు అవసరమా అని చూసుకోండి. ఇది నిజమైన తగ్గింపా లేదా పాత స్టాక్‌ను క్లియర్ చేయడానికి ఒక వ్యూహమా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

**స్టోర్ కార్డ్‌ల పట్ల జాగ్రత్త**

స్టోర్ క్రెడిట్ కార్డ్‌ల కోసం షాప్ వాళ్లు చాలా రకాల వ్యూహాలు చేస్తారు. ఆ మాయలో పడిపోవద్దు. ఇది చూసేందుకు తక్కువ ధరలోనే కదా అని మనకు అనిపించవచ్చు. దాని వెనక కిటుకు వేరే ఉంటుంది. ఎక్కువగా కొనేలా చేస్తుంది. నెలాఖరున బిల్లు తడిసి మోపెడవుతుంది.

**ఆకలితో షాపింగ్**

మాల్‌స్‌లో తరచుగా ఫుడ్ కోర్ట్‌లు ఉంటాయి. ఇవి మిమ్మల్ని ప్రలోభపెట్టడానికి వ్యూహాత్మకంగా రుచికరమైన వాసనలు వచ్చేలా ఉంటాయి. మీరు షాపింగ్ చేసే ముందు తిని వెళ్లండి. తిండికి ఏ ఖర్చూ ఉండదు.

**వదిలేయండి**

స్నేహితులతో షాపింగ్ చేయడం సరదాగా ఉంటుంది. కానీ అది తెలియకుండానే ఒత్తిడికి, అనవసరమైన ఖర్చులకు దారితీయవచ్చు. వారి ముందు బిల్డప్ ఇచ్చేందుకు షాపింగ్ కోసం ఎక్కువ ఖర్చు చేస్తాం. తర్వాత తల పట్టుకుంటాం. షాపింగ్ మాల్ వెళ్లినప్పుడు పైన చెప్పిన చేయవలసినవి, చేయకూడనివి అనుసరించాలి. తద్వారా మీరు సరిగా షాపింగ్ చేస్తారు. మీ మాల్ అనుభవాన్ని ఆనందదాయకంగా, బడ్జెట్ స్నేహపూర్వకంగా చేయడంలో కొంచెం ప్రణాళిక, స్వీయ నియంత్రణ చాలా అవసరం.

మూవీభేరి

# నన్ను ఒంటరిగా కలవమని అడిగారు



ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చేవారేకాదు.. స్టార్‌స్టేటస్ తెచ్చుకున్న చాలామంది హీరోయిన్లు ఎప్పుడో ఒకప్పుడు క్యాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొన్నవారే! ఆ బాధితుల జాబితాలో తాను కూడా ఉన్నానని చెబుతున్నది ముంబై భామ ఇషా కొప్పికర్. నాగార్జున సరసన చంద్రలేఖ సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఇషా.. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తాజాగా.. శివ కార్తికేయన్ హీరోగా చేసిన 'అయలాన్' సినిమాలో కనిపించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో 'క్యాస్టింగ్ కౌచ్'పై సంచలన కామెంట్లు చేశారు. 'ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన కొత్తలో ఒక స్టార్ నటుడు నన్ను ఒంటరిగా కలవమని అడిగారు. డ్రైవర్ కూడా లేకుండా రావాలని చెప్పారు. అప్పటికే తనపై చాలా రూమర్స్ ఉన్నాయని, ఎవరికైనా తెలిస్తే ఇబ్బంది అవుతుందని కూడా అన్నారు. ఆ సమయంలో ఆయన బాలీవుడ్‌లో స్టార్ హీరో. అయినా.. ఆయన్ను కలవడానికి ఆసక్తిగా లేనని చెప్పేశాను. అంతేకాదు, సినిమాల్లో అవకాశాలు రావాలంటే హీరోలతో స్నేహంగా ఉండాలని కొంతమంది సలహాలు కూడా ఇచ్చేవారు. షూటింగ్ సమయంలోనూ కొందరు నటులు అసభ్యకరంగా తాకేవారు' అని చెప్పుకొచ్చారు ఇషా. కాగా, ఈ సీనియర్ హీరోయిన్ తెలుగులో ప్రేమతో రా, కేశవ సినిమాలలో కూడా నటించారు.

# మనసు తీసుకో.. నిద్ర ఇచ్చెయ్!

అందంతోపాటు అభినయం ఆమె సొంతం. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటి నుంచీ వరుసగా సినిమాలు చేస్తూ.. స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. దాదాపు అగ్ర హీరోలందరి సరసన నటించి.. బాలీవుడ్ టాప్ హీరోయిన్‌లలో ఒకరిగా ఉన్నారు శ్రద్ధా కపూర్. బీటౌన్‌లో హీరోయిన్లపై రూమర్లు సాధారణమే. అయితే, 37 ఏళ్ల ఈ భామ.. 34 ఏళ్ల వ్యక్తితో డేటింగ్ చేస్తున్నట్టు వస్తున్న వార్తలు మాత్రం అభిమానులకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన 'తు ఝూఠీ మే మక్కార్' సినిమాకు రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు రాహుల్ మోడీ. ఆ సినిమాలో ఫిమేల్ లీడ్ రోల్ చేశారు శ్రద్ధ. ఈ సినిమా తర్వాత నుంచి శ్రద్ధ, మోడీ డేటింగ్‌లో ఉన్నారన్న వార్తలు బీటౌన్‌లో చక్కర్లు కొడుతున్నాయి. వాళ్లిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు కూడా సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో వాటిపై ఒక్క పోస్ట్‌తో క్లారిటీ ఇచ్చేశారు శ్రద్ధ. రాహుల్‌తో దిగిన ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేశారు శ్రద్ధా కపూర్. ఆ ఫొటోలో అతని చెయ్యి పట్టుకుని నవ్వుతూ కనిపించారు కూడా! అంతేకాదు, ఆ ఫొటోకు 'నా మనసును తీసుకుని వెళ్లు. కానీ, నా నిద్రను మాత్రం నాకు తిరిగి ఇచ్చెయ్' అనే క్యాప్షన్ పెట్టారు. హార్ట్ సింబల్‌తోపాటు నవ్వుతున్న ఎమోజీలనూ జతచేశారు. ఈ ఒక్క పోస్ట్‌తో.. తాను రాహుల్‌తో డేటింగ్‌లో ఉన్నట్టు శ్రద్ధ క్లారిటీ ఇచ్చేసిందని అంటున్నారు నెటిజన్లు. జామ్‌నగర్‌లో అత్యంత వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో కూడా శ్రద్ధ, రాహుల్ జంటగా కనిపించడం విశేషం.



# తారక్ అసాధారణ ప్రతిభాశాలి



తారక్ 'దేవర' చిత్రానికి పనిచేస్తుండటంపై బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫ
ర్ బాస్కో మార్టిన్ ఆనందం వెలిబుచ్చారు. ఎన్టీఆర్‌తో పనిచేయడం పట్ల
ఎగ్జయిట్ అవుతూ తన ఇన్‌స్టాలో తారక్‌తో కలిసి దిగిన ఫొటోలను షేర్
చేశారు బాస్కో మార్టిన్. బాలీవుడ్‌లో కొరియోగ్రాఫర్‌గా బాస్కో మార్టిన్‌ది
ప్రత్యేకస్థానం. పఠాన్, వార్, ఫైటర్ చిత్రాల్లో ఆయన కంపోజ్ చేసిన అద్భు
తమైన నృత్యరీతులు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం
ఆయన 'దేవర' సినిమాకు పనిచేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో
ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సినిమాలోని ఓ
పాటకు బాస్కో మార్టిన్ కొరియోగ్రఫీ అందించనున్నారు. ఈ పాట చిత్రీక
రణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది. అక్కడ తారక్‌తో దిగిన ఫొటోలనే
ఆయన ఇన్‌స్టాలో షేర్ చేశారు. తారక్ అసాధారణ ప్రతిభాశాలి అని,
అతనితో పనిచేయడం గొప్ప అదృష్టమని బాస్కో మార్టిన్ అన్నారు. రెండు
భాగాలుగా ఈ సినిమా రూపొందుతోంది. సెప్టెంబర్ 27న తొలిభాగం
విడుదల చేస్తారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో
సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే.



# భారీ రన్‌టైమ్‌తో భారతీయుడు 2

కొన్ని రోజులుగా సరైన విజయాలు లేక ఇబ్బందిపడ్డారు కమల్‌హాసన్. అయితే.. ప్రస్తుతం ఆయన టైమ్ నడుస్తున్నది. కమల్ 'విక్రమ్' సినిమా ఆరువందలకోట్ల వసూళ్లను రాబట్టి, ఆయన కెరీర్‌లోనే భారీ విజయంగా నిలిచింది. ఈ నెల 27న 'కల్కి 2898'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు కమల్. ఇందులో ఆయన సుప్రీం యాస్కిన్‌గా ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా వేడి చల్లారకముందే.. 'ఇండియన్ 2'ని కూడా సిద్ధం చేసేశారు కమల్‌హాసన్. వచ్చేనెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తెలుగునాట భారతీయుడు 2' పేరిట రిలీజ్ కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా గురించి ఓ తాజా వార్త వినిపిస్తున్నది. స్వతహాగా శంకర్ సినిమాలు కాస్త నిడివి ఎక్కువగా ఉంటాయి. 'ఇండియన్ 2' నిడివి ఇంకాస్త ఎక్కువని తెలుస్తున్నది. ఏకంగా 3 గంటల 10 నిమిషాల నిడివి వచ్చిందట ఈ సినిమా. అంతేకాదు, 'ఇండియన్ 2'కు సెన్సార్‌వారు ఏ సర్టిఫికెట్ ఇచ్చారట. ఇప్పటికే ఓవర్సీస్‌లో బుకింగ్స్ మొదలయ్యాయి. అక్కడ్నుంచి వచ్చిన సమాచారమే ఇది. కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్‌లైఫ్' అనే సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com